హంతకుడి వేట

ప్రతాప రవిశంకర్

"ఎవరు కావాలి?" అడిగిందా అమ్మాయి.

"మీరే కావాలి."

"నేనా!" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. మీ పేరు కస్తూరి అయినట్లయితే తప్పకుండా నేను మీ కోసమే వచ్చాను" అన్నది ఆమె.

"నా పేరు కస్తూరి. అయితే మీరు నా కోసమే వచ్చారు" అన్నది కస్తూరి నవ్వుతూ.

"అవును. నేను మీతో మాట్లాడాలి. నా పేరు నిర్మల" అన్నది నిర్మల.

"రండి. నా గదిలో కూర్చుని మాట్లాడుకుందాం" అన్నది కస్తూరి.

"కింద వద్దు. మేడమీద గది ఖాళీగా వుంటే ఆ గదిలో కూర్చుని మాట్లాడుకుందాం."

కస్తూరి ఆశ్చర్యపోయింది. తన యెదురుగా నిలబడి వున్న నిర్మలకేసి పరిశీలనగా చూసింది. నిర్మల అందంగా

వుంది. పెద్ద పెద్ద కళ్ళు, చిన్న నోరు, ఎర్రని పెదవులు. సన్నగా నాజూకుగా వుంది.

అటూ ఇటూ చూసి "రహస్యమా?" అని అడిగింది కస్తూరి.

"అవును" అన్నది నిర్మల.

"అయితే పదండి" అని మెట్లవయిపు నడిచింది కస్తూరి.

ఇద్దరూ మేడమీదకు వెళ్ళారు. అక్కడ పక్క పక్కనే రెండు గదులు వున్నాయి. ఒక గదికి బయట గొళ్లెం వేసి వుంది. గొళ్ళెం తీసి తలుపులు తెరిచింది కస్తూరి.

లోపలకు వెళ్ళారు. కిటికీ తలుపులు తెరిచే వున్నాయి. ఎండ లోపలకు పడుతోంది. ఎండతోపాటు గాలికూడా రివ్వున లోపలకు వస్తోంది.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పండి. ఏమిటా రహస్యం?" అన్నది కస్తూరి.

"చెబుతాను. ఈ గది తలుపులు మూయాలి" అని లేచి తలుపులను మూసి గడియపెట్టింది.

"అంతా సస్పెన్స్‌గా ఉంది. ఏమిటిదంతా?" అన్నది కస్తూరి.

నవ్వింది నిర్మల.

"భయపడకండి. నేను మిమ్మల్ని ఏమీ చెయ్యటానికి రాలేదు" అన్నది.

"మరెందుకు వచ్చారు?"

"సుందరం గురించి మాట్లాడటానికి వచ్చాను" అన్నది నిర్మల.

ఉలిక్కిపడింది కస్తూరి.

గబుక్కున "సుందరం విషయమా!" అన్నది.

"అవును. మీ గురించి నాకు అంతా తెలుసు. సుందరంను మీరు ప్రేమించారనీ, చివరకు మోసపోయారనీ అతను మీకు తీరని ద్రోహం చేశాడనీ తెలుసు. అందుకే నేను మీ దగ్గరకు వచ్చాను" అన్నది నిర్మల.

ఆమె అలా అనగానే కస్తూరి ముఖం అదోలా అయిపోయింది. కళ్ళు యెర్రగా అయిపోయాయి. పెదవులు ఆవేశంతో వొణికాయి.

"నేను కూడా మీలాంటిదాన్నే. మీలాగే సుందరం నన్ను కూడా ఘోరంగా మోసం చేశాడు" అన్నది నిర్మల.

"నిజమా!" అన్నది కస్తూరి.

"అవును. నేను కూడా అతన్ని ప్రేమించాను. నన్ను కూడా తను ప్రేమించానని అన్నాడు. పెళ్ళి చేసుకుంటానని యెంతో ఆశపెట్టాడు. తీరా తన మోజు తీరిన తర్వాత నన్ను అవమానించి గెంటేశాడు. అందుకే నేను మీ దగ్గరకు వచ్చాను" అన్నది నిర్మల.

"ఎందుకు?" అడిగింది కస్తూరి.

"సుందరాన్ని హత్యచెయ్యటానికి."

"హత్యా!" అదిరిపడింది కస్తూరి.

"అవును. హత్యే! మనిద్దర్నీ యింత దారుణంగా మోసంచేసిన దుర్మార్గుడు బతికి వుండటానికి వీలులేదు. వాడిని మనం హత్య చెయ్యాలి" ఆవేశంగా అన్నది నిర్మల.

"నాకూ పగ తీర్చుకోవాలనే వుంది. కాని హత్య చెయ్యటానికి నేను వొప్పుకోను. హత్యలంటే నాకు

చచ్చే భయం. హత్య చేస్తే మనం జైలుకి వెళ్ళాలి. జరిగిందేదో జరిగిపోయింది. ఇదంతా నా తలరాత అని సరిపెట్టుకున్నాను. నేను అతన్ని హత్య చెయ్యటానికి వొప్పుకోను" అన్నది కస్తూరి భయంగా.

నవ్వింది నిర్మల.

"నువ్వింత పిరికిదానివనుకోలేదు. 'నువ్వూ' అంటున్నందుకు యేమీ అనుకోకు. మనిద్దరం అక్కచెల్లెళ్ళ వంటి వాళ్ళం. మనిద్దరం దగా పడినవాళ్ళమే. కాబట్టి యిలాగే అనుకుందాం. నువ్వుకూడా నన్ను 'నువ్వు' అనే అను. ఇక మన విషయానికి వస్తాను. 'హత్య' అంటే నువ్వు కంగారుపడవలసిన పనిలేదు. అసలు ఆ హత్య యేదో నేనే చేస్తాను. నువ్వు నాకు కొంచెం సాయపడితే చాలు."

"నువ్వు హత్య చేస్తావా?" కళ్ళు పెద్దవిచేసి అడిగింది కస్తూరి.

"అవును. తప్పకుండా చేస్తాను. ఆడదాన్ని ఆట బొమ్మలా వాడుకున్న ఆ నీచుడిని నేను హత్య చెయ్యకుండా వదిలిపెట్టను. నువ్వు కూడా నాలాగే వాడిచేత మోసపోయినదానివి కాబట్టి నీ దగ్గరకు వచ్చాను. నువ్వు కూడా ఆలోచించు. మనం ఆడవాళ్ళమే కావచ్చు. కాని అబలలం కాదు. మన బుర్రలో కూడా తెలివి ఉంది. వంట్లో శక్తి ఉంది. మనకు జరిగిన అన్యాయానికి తగిన ప్రతీకారం తీర్చుకోవాలి. ఇందుకు నాకు నీ సహాయం కావాలి. ఏమంటావ్? చెప్పు కస్తూరి. ఆ సుందరంగాడి కథ అంతమయిపోవాలి. వాడింకా యీ భూమ్మీద బతికి ఉండటానికి వీలులేదు. వాడు చచ్చిపోవాలి"

అన్నది నిర్మల.

"నాకు భయంగా ఉంది" అన్నది కస్తూరి.

అప్పటికే కస్తూరి వంటినిండా చెమటలు పట్టాయి.

"భయం యెందుకు? యెవ్వరికీ దొరక్కుండా హత్య చేద్దాం. దేవుడు కూడా మనల్ని పట్టుకోలేడు. హత్య చెయ్యటానికి తగిన ప్లానును నేను తయారుచేస్తాను. వాడిని యీ లోకం నించి పంపించేద్దాం. నువ్వు సరేనంటే నేను ప్లాను తయారుచేస్తాను" అన్నది నిర్మల.

కస్తూరి వెంటనే మాట్లాడలేదు. లేచి నిలబడి ఆ గదిలో ఉన్న కూజాలోనించి రెండు గ్లాసుల నీళ్ళు వంచుకుని తాగింది.

పమిటతో ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంది.

"ఇప్పుడే నువ్వు నీళ్ళు కారిపోతున్నావు. కొంచెం ధైర్యంగా ఉండు. బాగా ఆవేశాన్ని తెచ్చుకో. పగనీ, ప్రతీకారాన్ని పెంచుకో. అప్పుడు నీలో భయం ఉండదు. పగ, కసి భయాన్ని తరిమేస్తాయి. మరి నువ్వు వొప్పుకున్నట్లేనా?" అన్నది నర్మల.

చిన్నగా తల వూపింది కస్తూరి.

"థాంక్ యూ కస్తూరి! ఇక ఆ సుందరంగాడికి రోజులు దగ్గర పడ్డాయి. ఈ భూమ్మీద వాడికి నూకలు చెల్లిపోయాయి. మనల్ని మోసంచేసి వాడి చావును వాడే కోరి తెచ్చుకున్నాడు. మరి నేను వెళతాను. ఈ రాత్రికి నేను ఆ సుందరంగాడిని హత్య చెయ్యటానికి పటిష్టమయిన పథకాన్ని తయారుచేస్తాను. రేపు మళ్ళీ కలుస్తాను. నువ్వు ధైర్యంగా వుండు" అని కస్తూరి భుజంతట్టి లేచి నిలబడింది నిర్మల.

తర్వాత గది తలుపులను తెరిచింది. ఇద్దరూ బయటకు

వచ్చారు.

"ఈ పక్కగదిలో యెవరైనా వున్నారా?" అడిగింది నిర్మల కస్తూరిని.

"ఇది మా మామయ్య గది. ఎప్పుడూ తాగి నిద్ర పోతూ వుంటాడు. వొట్టి మొద్దు" అన్నది చిన్నగా నవ్వి.

నిర్మల కూడా నవ్వి "యిక దిగుదాం" అన్నది మెట్ల వయిపు నడచి.

కస్తూరి పాలిపోయిన మొహంతో నిర్మల వెనుకే నడిచింది.

2

'అరుణా ఐరన్ స్టోర్సు' ముందు ఆటో దిగింది అరుంధతి.

మీటర్ చూసి ఫేర్ చెల్లించింది.

"చిల్లర లేదు" అన్నాడు డ్రయివర్.

"ఫర్వాలేదు వుంచుకో" అని హేండు బ్యాగ్ మూసుకుంటూ స్టోర్స్ లోపలకు నడిచింది.

షాపులో యెవరో ఒక మనిషి యేదో బేరం చేస్తున్నాడు. అతను వెనక్కి తిరిగి అరుంధతిని చూశాడు. అతను చూపులను ఆమె మీద నించి మరల్చుకోలేక పోయాడు.

షాపులో గుమస్తాలు కూడా ఆమెను తినేసేలా చూశారు.

"రండి....రండి" అన్నాడు ఒక నడివయసు గుమస్తా.

అతని దగ్గరకు నడిచింది అరుంధతి.

"ఏం కావాలి?" అడిగాడతను.

"కత్తి."

ఉలిక్కిపడ్డాడతను. ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"ఉన్నాయా? లేవా?" అంది అరుంధతి విసుగ్గా మొహంపెట్టి.

"ఉన్నాయి. ఎటువంటివి కావాలి??"

"బాగా పదునుగా వున్నది. ఒక్క పోటుకే మనిషిని చంపగలిగేది."

ఈ సారి షాపులో వున్న గుమస్తాలు బేరంచేస్తున్న అతను కూడా అదిరిపడ్డారు.

"ఏమిటి అలా చూస్తావ్? ఇంతవరకూ నువ్వు ఆడదాన్ని చూడలేదా?" అనడిగింది.

అతను తేరుకున్నాడు.

గబగబా ఒక అరలోనించి కత్తి ఒకటి బయటకు తీసి "దీన్ని చూడండి" అన్నాడు.

"ఇంతకంటే పెద్దది లేదా?" అడిగింది.

"ఇదే పెద్దది. ఒక్కపోటుతో ఖాళీ" అన్నాడతను నవ్వుతూ.

"పొడిచేదా?" అన్నది నవ్వి అరుంధతి.

"మీరు బలే జోక్‌గా మాట్లాడతారు" అన్నాడతను.

నవ్వింది అరుంధతి.

"ఎంత?" అన్నది.

"పన్నెండు రూపాయలు."

హేండుబ్యాగ్ తెరిచింది అరుంధతి. పదిహేను రూపాయలు బయటకు తీసింది.

"పేరు చెప్పండి" అన్నాడు గుమస్తా బిల్లు రాయడానికి.

"కస్తూరి" అన్నది అరుంధతి.

అతను బిల్లు రాసి ఇచ్చాడు. డబ్బులు తీసుకుని చిల్లర

ఇచ్చాడు.

ఒకసారి ఆతనికేసి చూసి నవ్వి అక్కడినించి కదిలింది అరుంధతి.

"అప్పుడప్పుడు వస్తూ వుండండి" అన్నాడు పాపతను.

"అలాగే. ఇంకో కత్తి అవసరమయితే యిక్కడికే వస్తాను" అన్నది.

తర్వాత బయటకు నడిచింది.

షాపులో మనుషులందరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

3

ఉదయం తొమ్మిది గంటల సమయంలో నిర్మల— కస్తూరి యింటికి వెళ్ళింది.

ఇద్దరూ కలిసి మేడమీదకు వెళ్ళారు.

గది లోపలకు వెళ్ళి తలుపులు వేసుకున్నారు.

"ప్లాను ఆలోచించావా?" అడిగింది కస్తూరి.

"ఆ. పటిష్టమైన ప్లాను."

"చెప్పు. ఏమిటి?" అడిగింది కస్తూరి.

"చెప్పమంటున్నావు. నీకు కొంచెం ధైర్యం వచ్చి నట్టుంది" అన్నది నిర్మల.

"అవును. రాత్రంతా బాగా ఆలోచించాను. వాడంత ఘోరంగా మనల్ని మోసం చేసినందుకు వాడిని ఎందుకు చంపకూడదు? అనిపించింది" అన్నది.

"వెరీగుడ్. అయితే విను. సుందరం వుంటున్న ఇంటి గురించి నీకు బాగా తెలుసు కదా. బాత్‌రూంలో నించి లోపలి గదిలోకి దారి వుంది. ఆ బాత్‌రూం తలుపును సుందరం సాధారణంగా ఎప్పుడూ బోల్టువేసి వుంచదు. ఎందుకంటే ఎవరయినా రాత్రిపూట ఎవ్వరికీ తెలియ

కుండా రావటానికీ పోవటానికీ అలా చేస్తాడు. అందుకని మనం సులభంగా సుందరం ఇంట్లోకి ప్రవేశించవచ్చు.

రేపు రాత్రి పన్నెండు గంటలకు ఇద్దరం ఆ దారిలో నించి లోపలకు వెళదాం. సుందరం రోజూ బాగా తాగి గదికి వస్తాడు. మంచి మత్తులో వుంటాడు. కాబట్టి వాడిని మనం అప్పుడే కత్తితో పొడిచి చంపటం చాలా సులభం. ఒక్కపోటుతో కిక్కురుమనకుండా చస్తాడు. మనం వెంటనే మనకు సంబంధించిన ఆధారాలు వాడి దగ్గర ఏవీ లేకుండా వెతికి తీసుకురావాలి. అప్పుడు మనల్ని యెవ్వరూ అనుమానించలేరు. ఇదీ ప్లాను. అయితే మనం దీన్ని అమలు జరపటానికి కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలి'' అన్నది నిర్మల.

''ఏమిటి అవి?'' అడిగింది కస్తూరి.

''ముందు మనం హత్యాయుధం ఐన మంచి పదునైన కత్తిని ఒకటి సంపాదించాలి. నా దగ్గర కత్తిలేదు. మీ ఇంట్లో వుందా?''

''మా ఇంట్లో చిన్న చిన్న కత్తులు వున్నాయి. వాడితో పొడిస్తే కోడి కూడా చావదు'' అన్నది కస్తూరి.

''అయితే మనం తప్పకుండా ఒక కత్తిని కొనాలి.''

''కొనేద్దాం.''

''కొనవచ్చు. కాని కొనడానికి మనం షాపుకు వెళితే ప్రమాదం. షాపువాడు మనిద్దరిలో ఎవరు వెళితే వాళ్ళను గుర్తుపెట్టుకుంటాడు. హత్య జరిగిన తర్వాత పోలీసులు దర్యాప్తు చేస్తారు. అప్పుడు మనం కత్తి కొన్న విషయం బయటపడుతుంది. షాపువాళ్ళు మనల్ని గుర్తుపడతారు. కాబట్టి మనం షాపుకు వెళ్ళకూడదు'' అన్నది నిర్మల.

''వెళ్ళకుండా ఎలా?''

"అదే అసలు సమస్య. ఎవర్నయినా పంపించాలి."

"ఎవరు వెళతారు?"

"ఎవరు వెళ్ళినా వాళ్ళకయినా మన విషయం తెలుస్తుంది."

"మరేం చేద్దాం?"

"మనిద్దరిలో ఒకరు మారు వేషంలో వెళ్ళి కత్తిని కొనుక్కురావాలి."

"మారువేషంలోనా?"

"అవును. నేనో, నువ్వో మారువేషంలో వెళ్ళి కత్తిని కొనుక్కురావాలి. సరే, నువ్వు ముందే భయస్థురాలివి. నేను కొంటాలే. రాత్రి ఎనిమిదింటికి రెడీగా వుండు.... వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయింది నిర్మల.

4

ఇంటిముందు ఆటోలోనించి దిగాడు సుందరం.

"ఎంతయ్యింది?" అడిగాడు డ్రైవర్‌ని.

"అయిదూ ఇరవై."

ఆరు రూపాయలు అతని చేతిలో పెట్టి తూలుకుంటూ గేటు నెట్టుకుని లోపలకు వచ్చాడు అతను.

పదకొండు గంటలు కావస్తోంది. తాళం తీసి లోపలకు నడిచాడు. లోపలంతా చీకటిగా వుంది.

స్విచ్ నొక్కాడు. దీపం వెలిగింది.

దీపం వెలుతురులో ఆ గదిలో కుర్చీలో కూర్చున్న అరుంధతిని చూసి అతను ఆశ్చర్యపడ్డాడు.

"ఎవరు నువ్వు?" అడిగాడు సుందరం.

"ఎవరయితేనేం? నీ కోసమే వచ్చాను."

నవ్వాడు సుందరం. తర్వాత "థాంక్ యూ" అన్నాడు. అతను పాంటు—షర్టు విప్పలేదు. అలాగే బెడ్ మీద

పడిపోయాడు.

ఆమె కుర్చీలోనించి లేచి తలుపులను మూసింది.

"అందమైనదానివి" అన్నాడు అతను.

"అందుకే నిన్ను కోరి వచ్చాను."

"అయితే ఆలస్యం దేనికి? ఇలా రా?" అన్నాడు.

"కొంచెంసేపు దూరంగానే వుండి మాట్లాడుకుందాం" అని ఆమె హ్యాండుబ్యాగ్‌లోనించి సిగరెట్టు పెట్టె బయటకు తీసి లైటర్‌తో ఓ సిగరెట్టును వెలిగించింది.

"నువ్వు సిగరెట్లు కూడా కాలుస్తావా?" అన్నాడు సుందరం.

"సిగరెట్లే కాదు. బ్రాందీ కూడా తాగుతాను" అన్నదామె.

"నీ పేరు?"

"కస్తూరి అనుకో."

"అబద్ధం. నీ పేరు కస్తూరి కాదు."

"కాదు. కాని అనుకోమంటున్నాను."

"ఇంతకీ నువ్వు లోపలకు ఎలా వచ్చావ్?"

"మనసుంటే మార్గం లేదా? బాత్‌రూంలోనించి వచ్చాను."

"ఆ దారి నీ కెలా తెలుసు?"

"నాకు నీ గురించి అంతా తెలుసు?"

"ఇంతకీ నువ్వెవరు?"

"నీ పొందుకోరి వచ్చిన ఓ అందమైన ఆడదాన్ని."

అతను బెడ్‌మీదనించి లేవబోయాడు.

కాని అప్పటివరకు బీరువా చాటున దాక్కున్న మనిషి గబుక్కున బయటకు వచ్చి సుందరం నోరు నొక్కి బెడ్‌మీదకు పడేశాడు. మరునిముషంలో సుందరం

గుండెల్లో పొడుగాటి కత్తి బలంగా దిగబడింది.

చిన్నగా మూల్గి ప్రాణం వదిలాడు సుందరం.

తర్వాత ఇద్దరూ కత్తి పిడిమీద వేలిముద్రలు చెరిపి వేశారు.

తర్వాత ఆ గదిలో లైటార్పి అరుంధతి—కత్తితో పొడిచిన మనిషి గబగబా బాత్‌రూంలోనించి బయటకు వెళ్ళిపోయారు.

5

"నన్ను మీరే కాపాడాలి" అన్నది కస్తూరి.

"చెప్పండి. మిమ్మల్ని ఎవరినించి కాపాడాలి" అన్నాడు డిటెక్టివ్ జగదీష్ సిగరెట్టు ముట్టించి.

"పోలీసులనించి."

"ఎందుకు మీరేదయినా నేరం చేశారా?"

"చెయ్యలేదు."

"ఐతే మీరు భయపడాల్సిన అవసరంలేదు. మిమ్మల్ని తప్పకుండా రక్షిస్తాను. కేసు గురించి వివరంగా చెప్పండి" అన్నాడు జగదీష్.

మొహానికి పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకుంది కస్తూరి.

తర్వాత "మంచినీళ్ళు కావాలి" అన్నది.

ఫ్రిజ్‌లో వున్న వాటర్ బాటిల్ తీసి నీళ్ళు ఓ గ్లాసులోకి వంచి ఆమెకు ఇచ్చాడతను.

ఆమె నీళ్ళుతాగి గట్టిగా శ్వాస వదిలింది.

అందమైన ఆమె ముఖం భయంతో పాలిపోయి వుండటాన్ని అతను మొదట్లోనే గ్రహించాడు.

కస్తూరి తను సుందరాన్ని ప్రేమించటం మొదలు నిర్మల తనని కలుసుకుని అతన్ని హత్యచెయ్యటానికి

పథకం వెయ్యటం తర్వాత వాళ్ళిద్దరూ కలిసి క్రితంరాత్రి పన్నెండు గంటలకు సుందరం యింట్లోకి వెళ్ళినవరకు చెప్పింది.

"తర్వాత ఏమయ్యింది? నిర్మల అతన్ని హత్య చేసిందా?" అడిగాడు జగదీష్.

"లేదు. చెయ్యలేదు. ఇద్దరం సరిగ్గా పన్నెండు గంటలకు ఆ యింట్లోకి వెళ్ళాము. లోపలంతా చీకటిగా వుంది. నిర్మల తనతో చిన్న టార్చిలైటును కూడా తీసుకు వచ్చింది. దాన్ని వెలిగించి చూసింది. ఆ వెలుతురులో చూశాను. సుందరం బెడ్ మీద వెల్లకిలా పడిపోయి వున్నాడు. అతని గుండెల్లో నించి కత్తిపిడి బయటకు కనిపిస్తోంది. అప్పుడే ఎవరో అతన్ని పొడిచి వుండాలి. రక్తం బెడ్ మీద నించి కిందకు కారుతోంది.

ఇక అక్కడ నిలబడలేకపోయాము. రోడ్డుమీద ఎవరో నడుస్తున్న బూట్ల చప్పుడు వినిపించింది. గబుక్కున వెనక్కి పరుగుదీయబోయాను. నా పక్కనే నిర్మల నిలబడి వుండటంవల్ల ఆమెకు తగిలి నేను పడబోయాను. ఆమె నన్ను పట్టుకుంది.

వెంటనే ఇద్దరం బాత్ రూంలోనించి బయటపడి రోడ్డెక్కాము. సగం దూరం వెళ్ళిన తర్వాత గుర్తుకు వచ్చింది. నా హ్యాండ్ బ్యాగ్ అక్కడే పడిపోయింది. వెనక్కి వెళ్ళి దాన్ని తెచ్చుకోవాలంటే భయమేసింది. రాత్రి ఇంటికి వెళ్ళలేదు. నిర్మల గదిలోనే పడుకున్నాను. తెల్లవార్లూ మేమిద్దరం సుందరాన్ని చంపినవాళ్ళ గురించి ఆలోచించాము. కాని వూహించలేకపోయాము.

తెల్లవారిన తర్వాత ఇంటికి వెళ్ళాను. ఇంటి బయటనే పోలీసుజీపు కనిపించింది.

నా హ్యాండుబ్యాగ్ ఆధారంగా పోలీసులు నా కోసం వచ్చారనీ, హత్యానేరం నా మీద పడుతుందనీ భయమేసింది—ఈ పరిస్థితుల్లో నన్ను కాపాడగల మనుషుల గురించి ఆలోచించాను. మీరు గుర్తుకు వచ్చారు. వెంటనే మీ దగ్గరకు వచ్చాను. నేను నిర్దోషిని. ఆవేశంలో ఏవో చెయ్యబోయాను. నన్ను మీరే రక్షించాలి" అన్నది కస్తూరి.

"ఆల్ రైట్. మీరు నిజంగా నిర్దోషయితే మీకు నా రక్షణ లభిస్తుంది. ముందు నేను నిర్మలని కలుసుకోవాలి. ఆమె ఎడ్రసు ఇవ్వండి" అన్నాడు జగదీష్.

చెప్పింది కస్తూరి.

"నేను యీ హత్యకేసును దర్యాప్తు చేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ని కూడా కలుసుకుంటాను. వీలయినంత త్వరలో హంతకుడిని పట్టుకుంటాను. అప్పటివరకూ మీరు యిక్కడే వుండండి. లోపల ఇంకో గది వుంది. మీకు కావలసిన సదుపాయాలన్నీ వున్నాయి" అన్నాడు.

"థాంక్ యూ" అన్నది కస్తూరి.

"నో మెన్షన్. ఇది నా బాధ్యత. మీ ఎడ్రసు కూడా యివ్వండి" అని కస్తూరి ఇంటి ఎడ్రసు తీసుకుని బయటకు నడిచాడు డిటెక్టివ్ జగదీష్.

6

డిటెక్టివ్ జగదీష్ తన స్కూటర్ని పోలీసుస్టేషన్ ముందు ఆపాడు.

లోపలకు నడిచాడు.

ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ అప్పుడే యెక్కడికో బయల్దేరే ప్రయత్నంలో వున్నాడు.

జగదీష్‌ను చూడగానే "నీ కోసమే బయల్దేరు

తున్నాను. నువ్వే వచ్చావ్? ఏమిటీ విశేషం?" అని అడిగాడు.

"విశేషం ఏమీ లేదు. చూసి పోదామని వచ్చాను" అన్నాడు జగదీష్.

"ఓ హత్య జరిగింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఎప్పుడు? ఎక్కడ?"

"రామ్‌నగర్‌లో. ఉదయం ఎనిమిది గంటలకు ఫోన్ వచ్చింది. వెళ్ళాను. సుందరం అనే ముప్పయేళ్ళు దాటిన మనిషి తన ఇంట్లో హత్యచెయ్యబడ్డాడు. హత్యాయుధం కత్తి. హత్య రాత్రి పదకొండు పన్నెండు గంటల మధ్య జరిగింది."

"హంతకుడి గురించిన ఆచూకీ ఏదయినా దొరికిందా?" జగదీష్ అడిగాడు.

"దొరికింది. హంతకుడు మగమనిషి కాదు. ఓ ఆడది. ఆమె పేరు కస్తూరి."

"ఇవన్నీ నీకు ఎలా తెలుసు. అప్పుడే ఇంత దర్యాప్తు చేశావా?"

"ఇప్పుడు నేను చేసిన దర్యాప్తు ఏమీలేదు. హత్యాస్థలంలోనే ఓ హ్యాండుబ్యాంగ్ దొరికింది. ఆ బ్యాగ్‌లోనే ఆ కస్తూరి ఎడ్రస్ వుంది. అంతేకాదు-హత్యాయుధమైన కత్తిని ఆమె 'అరుణా ఐరన్ స్టోర్స్'లో కొన్నట్టుగా రశీదు కూడా వుంది. అయితే కత్తి పిడిమీద వేలిముద్రలు లేవు."

"ఈ హత్య జరగటానికి మోటివ్ ఏమిటో తెలిసిందా?"

"తెలీలేదు. కాని వూహించవచ్చు. హతుడి గదిని సెర్చ్ చేశాము. అతని గదిలో కస్తూరి—హతుడయిన

సుందరానికి రాసిన ఉత్తరాలు కొన్ని దొరికాయి. ఒక ఉత్తరంలో ఆమె తనని మోసం చెయ్యవద్దనీ, పెళ్ళి చేసుకొమ్మనీ రాసింది. దీన్నిబట్టి అతను ఆమెను మోసం చేసి వుంటాడనీ అందుకని కస్తూరి అతన్ని హత్యచేసి వుంటుందనీ అనుకుంటున్నాను.”

“నీ ఆలోచన సరయినదే కావచ్చు. ఒప్పుకుంటాను. కాని నువ్వు చెప్పినట్టుగా హత్యచేసిన మనిషి కస్తూరి అవకపోవచ్చు” అన్నాడు జగదీష్.

“ఎలా?” ప్రదీప్ అడిగాడు.

“ఒకటి: కత్తిపిడిమీద వేలిముద్రలు లేవని అన్నావు. అంటే హత్యచేసిన మనిషే తన వేలిముద్రలను చెరిపివేసి వుండాలి. లేదా వేలిముద్రలు పడకుండా గ్లవ్స్ తొడుక్కుని హత్యచేసి వుండవచ్చు. అంటే హంతకుడు తను బయటపడకుండా వుండటానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టే లెఖ్ఖ.

ఒకవేళ కస్తూరి నిజంగా సుందరాన్ని హత్యచేసినట్టయితే తన హేండు బ్యాగ్‌ను అక్కడ వదిలి వెళ్ళిపోదు. ఒకవేళ హత్యచేసిన హడావిడిలో మరచిపోయినా ఆమె హేండు బ్యాగ్‌లో కత్తిని కొన్నప్పుడు యిచ్చిన రసీదు వుండదు. ఆమె షాపులోనించి బయటకు రాగానే ఆ రసీదును చింపి వేస్తుంది. అంతేగానీ హేండు బ్యాగ్‌లో వేసుకుని తిరగదు.

ఇంకో విషయం....కస్తూరే సుందరాన్ని హత్యచేసి వున్నట్టయితే తను అతనికి రాసిన ఉత్తరాలను తీసుకుని వెళ్ళి ఉండేది. అక్కడ ఉంచేది కాదు. ఈ కారణాలను బట్టి నేను యీ హత్యచేసింది కస్తూరి కాదని అనుకుంటున్నాను” అన్నాడు జగదీష్.

"నువ్వు కేసును తికమక చేసేట్టుగా ఉన్నావు" ప్రదీప్ నవ్వుతూ అన్నాడు.

"నువ్వు కస్తూరి యింటికి వెళ్ళావా?"

"వెళ్ళాను. కాని ఆమె రాత్రి ఎనిమిది గంటలకు యిల్లు వదలి వెళ్ళిందట. ఉదయానికూడా తిరిగి రాలేదు. ఆమె హత్య చేసిందనీ, ఆమెను పట్టుకునే ప్రయత్నంలో వున్నామనీ చెప్పి వచ్చాను. ఆమె ఫోటో ఒకటి సంపాదించాము. ఆమె కోసం వేట జరుగుతోంది. సాయంత్రం లోపల ఆమె ఎక్కడ వున్నా పట్టుకుంటారు పోలీసులు."

"అరుణా ఐరన్ స్టోర్సులో ఎంక్వయిరీ చేశావా?" జగదీష్ అడిగాడు.

"వెళ్ళాము. ఉదయం మేము వెళ్ళేసరికి యింకా షాపు తెరవలేదు. ఇప్పుడు వెళ్ళాలి" చెప్పాడు ప్రదీప్.

"నేనుకూడా వస్తాను."

"నీ యిష్టం. నువ్వు పూనుకుంటే యీ కేసు ఇరవై నాలుగు గంటల్లోనే తేలిపోతుందనే నమ్మకం నాకు వుంది. పద మై డియర్ జగదీష్" అని లేచి నిలబడ్డాడు. హేట్ పెట్టుకున్నాడు.

ఇద్దరూ స్కూటర్ మీద బయలుదేరారు.

పావుగంట తర్వాత 'అరుణా ఐరన్ స్టోర్స్' ముందు ఆగింది స్కూటరు.

లోపలకు వెళ్ళారు.

ఇద్దరు మనుషులు ఏవో ఇనుపసామానులు చూస్తున్నారు.

ప్రదీప్‌ను చూడగానే "రండి....రండి" అని ఆహ్వానించాడు షాపతను.

కూర్చున్నారు.

ఇన్స్పెక్టర్ రశీదు తీసి పాపతనికి చూపించి "పద హారో తారీకున ఒక అమ్మాయి మీ దగ్గర కత్తి కొన్నది గుర్తుందా?" అనడిగాడు.

"కస్తూరి కదూ!" అనడిగాడతను.

"అవును."

"గుర్తులేకేం. చాలా అందమైన మనిషి" అన్నాడతను అరుంధతి అందాన్ని గుర్తుచేసుకుంటూ.

తర్వాత ఆ రోజు ఆమె షాపులోకి ప్రవేశించడం, ఒక్క పోటుతో మనిషిని చంపే కత్తి కావాలని అడగడం తర్వాత కత్తి తీసుకుని వెళ్ళడం అంతా చెప్పాడతను.

"ఎందుకు యివన్నీ? ఇంతకీ ఆమె హత్య చేసిందా?" అడిగాడు పాపతను.

"అవును."

ఉలిక్కిపడ్డాడు అతను. "ఆమె జోక్ చేస్తుందని అనుకున్నాము. నిజంగానే హత్య చేసిందా?"

"అవును. ఆమె ఎట్లా వుంటుందో వర్ణించి చెప్పండి" అన్నాడు ఇన్స్పెక్టర్.

చెప్పాడు పాపతను.

ఇన్స్పెక్టర్ మొహం అదోలా అయింది. అతను వెంటనే షర్టు జేబులోనించి కస్తూరి ఫోటో తీసి పాపతనికి చూపించి "ఈ అమ్మాయే కదూ కత్తిని కొన్నది?" అనడిగాడు.

"కాదు. ఈ అమ్మాయి కాదు. ఈమెను మేము యింతవరకూ చూడలేదు. పదహారో తారీకున కత్తి కొన్న ఆమె యింకా లావుగా ఉంటుంది. ఈమె కాదు" అన్నాడు పాపతను గట్టిగా.

"సరిగ్గా చూసి చెప్పండి. ఈమె పేరే కస్తూరి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"కావాలంటే మా షాపులో ఉన్న గుమస్తాలందరికీ చూపించండి. ఆ రోజున అందరూ ఆమెను చూశారు. ఎవరయినా చెప్పగలరు" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ కస్తూరి ఫోటోను గుమస్తాలందరికీ చూపించాడు. వాళ్ళు ఆమెను యింతవరగూ చూడలేదని చెప్పారు.

జగదీష్ "ఇక వెడదాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్‌తో

ఆ షాపతనికి థాంక్స్ చెప్పి అక్కడినించి బయటకు వచ్చాడు ఇన్‌స్పెక్టర్.

జగదీష్ షాపతనితో "మీ దగ్గర కత్తికొన్న అమ్మాయి ఎప్పుడయినా కనబడితే వెంటనే నాకు ఫోన్ చెయ్యండి" అని తన ఫోన్ నెంబర్ యిచ్చాడు. పోలీస్ స్టేషన్‌కు కూడా ఫోన్ చేసి చెప్పమన్నాడు.

సరేనన్నాడు అతను.

స్కూటరుమీద బయలుదేరారిద్దరూ.

"ఇప్పు డేమంటావ్?" అన్నాడు జగదీష్ ఇన్‌స్పెక్టర్‌తో.

"ఆశ్చర్యంగా ఉంది. కస్తూరి కత్తిని కొనలేదు. కాని కస్తూరి హేండు బ్యాగ్‌లో కత్తిని కొన్నట్టుగా ఆమె పేరు మీద రశీదు ఉంది. ఇదెలా సాధ్యం?" అన్నాడు.

"అర్థమయిందనుకుంటాను. ఎవరో కస్తూరిని యీ హత్య కేసులో యిరికించాలని ప్రయత్నం చేశారు. అసలు యీ హత్య చేసింది యింకెవరో. వాళ్ళే కస్తూరిని నేరస్థురాలిని చెయ్యాలని చూశారు."

ఇన్‌స్పెక్టర్ మాట్లాడలేదు.

"ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు తర్వాత.

"ఈ కేసు ఫైలు ఓసారి యివ్వు....తర్వాత అంతా నేను చూసుకుంటాను" అన్నాడు జగదీష్.

"అలాగే" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

స్కూటరు పోలీస్ స్టేషన్ ముందు ఆగింది.

7

జగదీష్ తనని తను పరిచయం చేసుకున్న తర్వాత "రండి" అని గౌరవంగా లోపలకు ఆహ్వానించాడు కస్తూరి తండ్రి.

ఆయన మొహం విచారంగా వుంది.

ఇద్దరూ ఓ గదిలోకి వెళ్ళారు.

కూర్చున్న తర్వాత "చెప్పండి. ఏం పనిమీద వచ్చారు" అనడిగాడాయన.

"మీ అమ్మాయి కస్తూరి గురించి మాట్లాడటానికి వచ్చాను."

ఆయన కుతూహలంగా ముందుకు వొంగి "కస్తూరి గురించా!" అన్నాడు.

"అవును."

"ఇప్పుడు ఎక్కడ వుంది? మా అమ్మాయి మీకు తెలుసా?" గబగబా అడిగాడాయన.

"తెలుసు. ఆమె యిప్పుడు నా దగ్గరే ఉంది."

"వివరంగా చెప్పండి. అది ఎవర్నో హత్యచేసిందని పోలీసులు దానికోసం తిరుగుతున్నారు. దాని తల్లి యింట్లో ఏడుస్తూ పడుకుంది. నాకు అంతా అయోమయంగా వుంది. అది హత్యచెయ్యటమేమిటి? మీకేమయినా చెప్పిందా?"

జరిగిందంతా చెప్పాడు జగదీష్.

ఆయన అంతా విని ఆశ్చర్యపోయాడు.

"నాకు అసలు ఏమీ తెలియదు. ఇప్పుడేమిటి చెయ్యటం? చెప్పండి. దాన్ని నిజంగా కనబడితే పోలీసులు అరెస్టు చేస్తారా?" అనడిగాడు.

"అరెస్టు చెయ్యకపోవచ్చు. ఇంతకు ముందే యిన్స్పెక్టర్ కస్తూరి యీ హత్య చేసివుండదనే అభిప్రాయానికి వచ్చాడు. కాబట్టి అనుమానితుల జాబితాలో ఆమెను ఉంచుతాడు. స్టేట్మెంట్ తీసుకుంటాడు. మీరు నాతో రండి. కస్తూరి నా దగ్గర వున్నట్టు నేను ఇన్స్పెక్టర్తో చెప్పలేదు."

"థాంక్యూ జగదీష్. మీరే అసలు హంతకుడిని పట్టుకోవాలి. ఎంత ఫీజయినా సరే యిచ్చుకుంటాను. నాకు ఉన్నది ఒక్కతే కూతురు. మేము బతుకుతున్నది దాని కోసమే" అన్నాడు ఆర్తిస్తున్నట్టుగా.

"అలాగే! త్వరలోనే హంతకుడిని పట్టుకుంటాను" అన్నాడు జగదీష్.

"ఒక్క నిముషం ఆగండి. ఈ వార్త నా భార్యతో చెప్పి వస్తాను" అని లోపలకు వెళ్ళాడాయన.

ఐదు నిముషాల తర్వాత రెండు కూల్ డ్రింకులతో తిరిగి వచ్చాడు. ఒకటి జగదీష్కు యిచ్చాడు.

"నా భార్యకు వొంట్లో బాగాలేదు. దానికి తోడు యీ చెడువార్త. ఇప్పుడు ఎంతో సంతోషపడుతోంది" అన్నాడాయన.

డ్రింకులు తాగిన తర్వాత యిద్దరూ స్కూటరుమీద బయలుదేరారు.

"కస్తూరిని ఏమీ అనకండి. అసలే ఆమె భయపడు

తోంది" అన్నాడు జగదీష్ దారిలో.

తల వూపాడు కస్తూరి తండ్రి.

8

ఫోన్ మోగింది. డిటెక్టివ్ జగదీష్ రిసీవర్ ఎత్తి "హలో" అన్నాడు.

"నేను భాయ్ ఇన్‌స్పెక్టర్ని. ఎంతవరకు వచ్చింది నీ పరిశోధన?" అడిగాడు.

"ఇంతవరకు కొంచెం కూడా ముందుకు పోలేదు. కస్తూరి యింటికి వచ్చింది."

"నిజమా! ఎప్పుడు తెలిసింది?"

"ఇంతకు ముందే. ఎందుకు? ఆమెను అరెస్టు చేస్తావా?"

"ఇంకెట్లా చేస్తాను? ఆమె యీ హత్య చేసివుండదనే విషయం తెలిసింది గదా!"

"మరేం చేస్తావ్?"

"కలుసుకుని మాట్లాడతాను. ఇప్పటివరకు ఎక్కడ ఉన్నదో తెలుసుకుంటాను."

"నీకు అంత శ్రమ అనవసరం భాయ్. కస్తూరి ఇప్పటి వరకు ఎక్కడ వుందో నన్ను చెప్పమంటావా?"

"నీకు తెలుసా?"

"అవును. నా దగ్గరే ఉంది."

"వాట్!"

"అవును భాయ్. ఆమె నీ గురించి భయపడింది. అందుకే తన యింటిదగ్గర నిన్ను, నీ బలగాన్ని చూడగానే భయపడి వచ్చి నా సహాయం కోరింది. ఇంతకు ముందే ఆమెను తండ్రితో యింటికి పంపించాను. నువ్వు ఆమెను కలుసుకోవాలంటే కలుసుకోవచ్చు."

"నాకు అంతా అయోమయంగా ఉంది. అసలు కస్తూరి నీ సహాయం ఎందుకు కోరింది? ఆమె ఈ కేసులో ఎలా యిరుక్కుంది? నువ్వు నాకు యీ విషయాలన్నీ ఎందుకు చెప్పలేదు?" కొంచెం నిష్ఠూరంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"చెబుదామనే అనుకున్నాను. కాని నువ్వు కస్తూరే యీ హత్య చేసివుంటుందనే అభిప్రాయంలో ఉన్నావు. ముందు నీకు ఆ అపోహ పోయిన తర్వాత యీ విషయం చెబుదామని ముందుగా చెప్పలేదు. ఇదీ విషయం. నువ్వు నిశ్చింతగా వుండు. నేను కస్తూరి తరఫున పరిశోధన చేస్తున్నాను. కొన్ని గంటల్లో హంతకుడిని నీకు పట్టియిస్తాను" అన్నాడు జగదీష్.

"ఇప్పుడు ఎక్కడికయినా వెళుతున్నావా?"

"అవును. ఈ కేసులో ఓ ముఖ్యమయిన మనిషిని కలుసుకోవడానికి వెళుతున్నాను. నువ్వు కస్తూరిని కలుసుకో. ఆమె నీకు అంతా చెబుతుంది" అని ఫోన్ పెట్టేశాడు అతను.

తర్వాత సిగరెట్టు వెలిగించాడు. గది తలుపులు మూసి స్కూటరుతో బయటకు వచ్చాడు.

కస్తూరి చెప్పిన నిర్మల అడ్రసును గుర్తు తెచ్చుకుని స్కూటరు మీద బయలుదేరాడు.

నిర్మల - సంజీవరెడ్డి నగర్‌లో ఉంటోంది.

రివ్వున దూసుకు వెడుతోంది స్కూటరు. ఆలోచిస్తూ స్కూటర్ని పోనిస్తున్నాడు. అతని మస్తిష్కంలో అనేక ఆలోచనలు దొర్లిపోతున్నాయి. కేసు పరిశోధించటానికి తగిన ఆధారాలు కనిపిస్తూనే ఉన్నాయి. కొంచెం లాజికల్‌గా ఆలోచిస్తే సులభంగానే అసలు హంతకుడు

ఎవరో తెలుస్తుంది.

ఈ కేసులో అనుమానితులు ముగ్గురూ ఆడవాళ్ళే. ఒకటి: కస్తూరి, రెండు: నిర్మల, మూడు: అరుణా ఐరన్ స్టోర్సులో కస్తూరి పేరుతో కత్తిని కొన్న స్త్రీ.

ఇంతకీ ఆమె ఎవరు?

కస్తూరి పేరుతో ఆమె ఎందుకు కత్తిని కొన్నది? ఆమె కత్తిని కొన్న రశీదు కస్తూరి హేండు బ్యాగ్ లోకి ఎలా వచ్చింది?

ఈ విషయం తెలిస్తే అంతా తెలిసిపోతుంది. ముందు నిర్మలను కలుసుకోవాలి.

సంజీవరెడ్డి నగర్ లో ప్రవేశించింది స్కూటరు. రెండు నిముషాల తర్వాత అతను ఓ యింటి ముందు ఆగాడు.

వరండాలో నలభైయేళ్ళ మనిషి ఏదో రాసుకుంటూ కూర్చున్నాడు.

జగదీష్ని చూడగానే "ఎవరు కావాలి?" అని అడిగాడు.

"ఈ యింట్లో నిర్మల అనే అమ్మాయి అద్దెకు ఉంటోంది. ఆమె కావాలి" అన్నాడు.

"నిర్మలా!" అన్నాడాయన ఆశ్చర్యంగా.

"అవును."

"సారీ. అయితే యీ యిల్లు కాదు. ఈ యింట్లో ఎవ్వరూ అద్దెకు ఉండడం లేదు."

"174 డి6 నెంబరు గల యిల్లు యిదే కదూ!"

"అవును. అయినా యీ యింట్లో అద్దెకు ఎవ్వరూ లేరు. మొత్తం యింట్లో మేమే ఉంటున్నాము."

"సారీ! అయితే నేనే పొరపాటుపడ్డాను" అని

ఆయనకు థాంక్స్ చెప్పి అక్కడినించి బయలుదేరాడు.

జగదీష్ ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి.

అసలు నిర్మల అనే అమ్మాయి లేనే లేదు. ఇంకెవరో అమ్మాయి ఉంది. ఆ అమ్మాయి నిర్మల పేరుతో కస్తూరిని కలుసుకుంది. అదే పేరుతో ఆమె 'అరుణా ఐరన్ స్టోర్స్'లో కత్తిని కొని వుండవచ్చు. తెలివిగా నాటకమాడి కస్తూరిని యీ హత్య కేసులో యిరికించాలని చూసింది. తన పని అయిపోగానే కనిపించకుండా మాయమయ్యింది. ముందు ఆమె కోసం వేట సాగించాలి.

స్కూటర్ని కస్తూరి యింటిముందు ఆపాడు జగదీష్.

అతను లోపలకు వెళ్లేసరికి కస్తూరి, ఆమె తండ్రి మాట్లాడుకుంటున్నారు.

జగదీష్ను చూడగానే యిద్దరూ లేచి నిలబడ్డారు.

అతను కూర్చోగానే "ఇంతకు ముందే ఇన్స్పెక్టర్ గారు వచ్చి వెళ్ళారు" అన్నాడాయన.

"ఏమన్నాడు ఆయన?"

"జరిగిందంతా చెప్పమన్నారు, చెప్పాను."

"వెరీగుడ్. చెప్పటమే మంచిది. నేనే ఆయనకు ఫోన్ చేసి మిమ్మల్ని కలవమని చెప్పాను."

"ఎంతవరకు వచ్చింది మీ పరిశోధన?" అడిగింది కస్తూరి.

"మధ్యలోనే వుంది. మీరు నాకు సరయిన ఇన్ఫర్మేషన్ యివ్వలేదు" అన్నాడు జగదీష్ కస్తూరితో.

"ఏమిటీ?"

"నిర్మల అడ్రస్ తప్పు చెప్పారు."

"కాదు. నేను చెప్పిన అడ్రసు తప్పు కాదు. కావాలంటే మీకు ఆ యిల్లు చూపిస్తాను."

"పదండి వెళదాం."

ఇద్దరూ స్కూటరుమీద బయలుదేరారు.

ఇరవై నిముషాల తర్వాత యింతకు ముందు తను వెళ్ళిన రోడ్డులోకి స్కూటర్ని మళ్ళించాడు అతను.

"అదిగో! ఆ నీలం రంగు గేటు వున్న యిల్లే" అన్నది కస్తూరి నూరంనించే.

గబుక్కున స్కూటర్ని ఆపేశాడు అతను. "బాగా చూడండి" అన్నాడు కస్తూరితో.

నవ్వింది కస్తూరి. "నాకు బాగా గుర్తు. నేను హత్య జరిగిన రోజు రాత్రి యీ యింట్లో ఎడమవైపున ఉన్న గదిలో పడుకున్నాను. నాతో పాటు నిర్మల కూడా అదే గదిలో పడుకుంది. తెల్లవారి లేచి ఇంటికి వచ్చాను" అన్నది.

"ఐతే నిర్మల మిమ్మల్ని మోసం చేసింది" అన్నాడు జగదీష్.

"ఏమిటి?"

"అవును. ఇంతకుముందు నేను ఆ ఇంటికే వెళ్ళి నిర్మల గురించి అడిగాను. అసలు ఆ ఇంట్లో యెవ్వరూ అద్దెకు లేరని చెప్పాడా ఇంటాయన. ఇందులో ఏదో మిస్టరీ వుంది."

"నిర్మల ఆ ఇంట్లో లేదని చెప్పాడా?" కస్తూరి అడిగింది.

"అవును."

"అబద్ధం. పోనివ్వండి స్కూటర్ని. ఆయనతో నేను మాట్లాడతాను" అన్నది.

"వద్దు. ఇప్పుడు ఆయన నిజం చెప్పడు. ఆయనచేత

నిజం ఇంకో విధంగా చెప్పించాలి" అని స్కూటర్ని వెనక్కి మళ్ళించాడు జగదీష్.

9

జగదీష్ తలుపులు తెరిచి లోపలకు వెళ్ళేసరికి ఫోన్ విరామలేకుండా మోగుతోంది.

రిసీవర్ ఎత్తి "నేను జగదీష్‌ని" అన్నాడు.

"నేను 'అరుణా ఐరన్ స్టోర్స్' ప్రొప్రయిటర్‌ని. పదహారవ తారీకున మా షాపులో కత్తికొన్న అమ్మాయి ఇంతకుముందే మా గుమస్తాకు కనిపించిందట."

"ఎక్కడ?" ఆత్రంగా అడిగాడు జగదీష్.

"కల్పనా థియేటర్‌కు వచ్చిందట. బాల్కనీ టిక్కెట్టు క్యూలో నిలబడిందట. మా గుమస్తా చూసి పది నిముషాలయ్యింది. మీరు వెంటనే బయల్దేరి వస్తే ఆమె కనపడుతుంది. షాపుకు రండి. గుమస్తానిచ్చి పంపిస్తాను" అన్నాడాయన.

"థాంక్యూ. ఇప్పుడే వస్తున్నాను" అని ఇన్‌స్పెక్టర్‌కు డయల్ చేసి అతనికి ఈ విషయం చెప్పాడు.

తర్వాత సంజీవరెడ్డి నగర్ 174 డి6 ఇంటి యజమానిని స్టేషన్‌కు తీసుకువచ్చి నిర్మల గురించి ఎట్లాగయినా బెదిరించి చెప్పించమని చెప్పాడు.

సరేనన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఫోన్ పెట్టేసి గదికి లాక్ చేసి స్కూటర్ మీద వేగంగా బయల్దేరాడు.

పదినిముషాల్లో 'అరుణా ఐరన్ స్టోర్స్' ముందుకు వెళ్ళాడు. అప్పటికే షాపు బయట గుమస్తా జగదీష్ కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాడు.

స్కూటర్ మీద గుమస్తా వెనక ఎక్కి కూర్చున్నాడు.

ముందుకు పోనిచ్చాడు జగదీష్ స్కూటర్ని.

ఐదు నిముషాల్లో కల్పనా థియేటర్ ముందు ఇద్దరూ దిగారు.

"మీకు అవసరమని బాల్కనీ టిక్కెట్టు ఒకటి సంపాదించాను" అన్నాడు షాపు గుమస్తా.

బుక్కింగ్ దగ్గర ఎవ్వరూ లేరు. మూసివున్నాయి.

"మంచిపని చేశావ్" అని స్కూటర్ లాక్ చేసి గబగబా గుమస్తాతో బాల్కనీవైపు నడిచాడు.

ఇంకా పిక్చర్ బిగిన్ కాలేదు.

మ్యాట్నీ షో కావటంవల్ల లోపల వెలుతురుగానే వుంది.

గుమస్తా గేటు దగ్గర నిలబడి లోపలకు చూశాడు. ఒక్కొక్కరినే పరిశీలనగా చూస్తున్నాడు. చటుక్కున అతని చూపు ఆగిపోయింది.

"అదిగో....ఆమే. ఆ ఎరుపురంగు శారీ కట్టుకుంది. వాలుజడ వేసుకున్నది. ఆమే" అన్నాడు గుమాస్తా.

చూశాడు జగదీష్. అరుంధతిని కూర్చుని వుంది.

"థాంక్స్. ఇదిగో ఈ పదిరూపాయలూ వుంచు టిక్కెట్టు తీసినందుకు" అని గుమస్తా చేతిలో నోటువుంచి లోపలకు వెళ్ళాడు జగదీష్.

అరుంధతికి రెండు వరసల వెనకవున్న సీట్లో కూర్చున్నాడు.

సినిమా మొదలయ్యింది.

జగదీష్ ముందు కూర్చున్న ఆమెనే చూస్తున్నాడు.

పదినిముషాలు గడిచాయి. అరుంధతి సినిమా చూడటంలో లీనమయిపోయినట్టుగా వుంది.

"చాలా అందంగా వుంది" అనుకున్నాడు జగదీష్.

గేటు దగ్గర వుండే కుర్రాడు అరుంధతి దగ్గరకువచ్చి చిన్న మడత పెట్టిన కాగితాన్ని ఇచ్చి వెళ్ళిపోయాడు.

జగదీష్ చూస్తూనే వున్నాడు.

ఆ కాగితంలో ఏముంది?

మడత విప్పింది అరుంధతి.

'డిటెక్టివ్ జగదీష్ నీ కోసం వచ్చాడు. పదినిముషాల తర్వాత థియేటర్లోనించి బయటకు వచ్చి ఆటోలో పాత ఇంటికి బయల్దేరు. అతను కూడా వెనకే వస్తాడు. పాత ఇంట్లో అతనికి సన్మానం చేద్దాం.'

చదివి దాన్ని ముక్కలు ముక్కలుగా చించివేసింది అరుంధతి.

ఒక్కసారి చేతినున్న వాచీకేసి చూసుకుంది. తర్వాత మళ్ళీ సినిమా చూడటం మొదలుపెట్టింది.

పదినిముషాలు గడిచింది.

లేచి నిలబడింది అరుంధతి.

ఎటూ చూడకుండా బయటకు వచ్చింది. గబగబా కిందకు దిగింది.

జగదీష్ కూడా థియేటర్లో నించి బయటకు వచ్చాడు.

ఆమె రోడ్డుమీదకు వచ్చి రోడ్డువారగా ఆగివున్న ఆటోలో ఎక్కి ఏదో చిన్నగా చెప్పింది.

ఆటో బయల్దేరింది.

స్కూటర్ని ఆటో వెనుకే పోనిచ్చాడు జగదీష్.

ఆటో స్టేషన్ రోడ్డులోకి మళ్ళింది. దానిని కొంచెం దూరంలో ఫాలో అవుతున్నాడు అతను.

యూనివర్శిటీ ఏరియా వైపు వెళుతోంది అరుంధతి ఎక్కిన ఆటో. వెళుతూ గబుక్కున ఓ సందులోకి మళ్ళి ఒక ఇంటిముందు ఆగింది.

అరుంధతి గబుక్కున ఆటోలో నించి దిగి తలుపుల మీద టకటక కొట్టింది. తలుపులు తెరుచుకున్నాయి. లోపలకు వెళ్ళింది. తలుపులు మూసుకున్నాయి.

ఆటో వెళ్ళిపోయింది.

ఆ ఇంటిముందు స్కూటర్ని ఆపాడు జగదీష్.

తలుపులమీద చప్పుడు చేశాడు.

పదినిముషాల తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా అరుంధతి నిలబడివుంది.

జగదీష్ను చూసి "ఎవరు కావాలి?" అని అడిగింది.

"నువ్వే కావాలి కస్తూరీ" అన్నాడు జగదీష్ నవ్వుతూ.

"నా పేరు కస్తూరి కాదు" అన్నది.

"ఆ విషయం నాకు తెలుసు. కాని నువ్వు కస్తూరి పేరుతోనే 'అరుణా ఐరన్ స్టోర్స్'లో కత్తిని కొన్నావు. ఔనా?"

"అవును. మాట్లాడుకుందాం రండి. అన్ని విషయాలూ వివరంగా చెబుతాను" అని వెనక్కు మళ్ళింది అరుంధతి.

ఆమె ముందు నడుస్తోంది. ఆమె వెనుకే నడుస్తున్నాడు జగదీష్. ఆమె ఏదో ఎత్తు వేస్తోందని అతనికి తెలుసు.

ఏమిటది?

మరో గదిలోకి ప్రవేశించారు.

జగదీష్ లోపలకు వెళుతుండగా ఏదో అలికిడి వినిపించి తలతిప్పి చూడబోయాడు. అప్పటికే అతని తల మీద బలమయిన దెబ్బ తగిలింది.

మొదలు నరికిన చెట్టులా వెనక్కు పడిపోయాడు. పడిపోతూ చూశాడు తనని కొట్టిన వ్యక్తిని. ఆ తర్వాత అతనికి స్పృహ పోయింది. స్పృహపోతున్నప్పుడు అతనికి

అరుంధతి నవ్వుతో పాటు మరో యువతి నవ్వు కూడా వినిపించింది.

10

"మర్యాదగా నిజం చెప్పు. లేకపోతే నీ ఒళ్ళు హూనం చేస్తాను" అన్నాడు ఇన్స్పెక్టర్ ప్రదీప్ ఆయనతో

"నా కేమీ తెలీదు. నిజంగా నా ఇంట్లో యెవ్వరూ అద్దెకు లేరు" అన్నాడాయన.

"అబద్ధం. నీ యింట్లో ఒక గదిలో నిర్మల అనే అమ్మాయి అద్దెకు వుంది. ఆ అమ్మాయితో పాటు ఇంకో అమ్మాయి కూడా ఆ గదిలో ఓ రాత్రి గడిపింది. ఆ అమ్మాయి నీ ఇంటిని గుర్తుపట్టింది. ఇక నువ్వు అబద్ధం చెప్పి ప్రయోజనం లేదు. ఇది హత్యకేసు. ఇందులో నిన్ను కూడా ఇరికిస్తాం."

"నిర్మల యెవరో నాకు తెలీదు. నన్ను నమ్మండి" అన్నాడాయన.

ఈడ్చి అతని దవడమీద అరచేతో కొట్టాడు ప్రదీప్.

బాధగా అరిచాడాయన.

"ఇది అన్యాయం నాకేం తెలియదు" అన్నాడు పళ్ళు బిగపెట్టి.

"తెలీదా?" అని బెల్టు వూడదీశాడు ప్రదీప్.

"నన్ను కొట్టవద్దు. నేను నిర్దోషిని" కేకలు పెట్టాడాయన.

బెల్టుతో ఆయన వీపుమీద కొట్టాడు ప్రదీప్.

"నన్ను చంపకండి. నిజం చెబుతాను. ఆపండి" అన్నాడు పెద్దగా.

"త్వరగా చెప్పు" గర్జించాడు.

"నిర్మల నిన్ననే గది ఖాళీచేసి వెళ్ళిపోయింది. తన గురించి యెవ్వరికీ చెప్పవద్దని నాకు వెయ్యిరూపాయలు యిచ్చింది. అంతేకాదు, వారంరోజుల తర్వాత నేను తన గురించి యెవ్వరికీ చెప్పకపోతే నాకు లొంగిపోతానన్నది. అందుకే నేను అబద్ధం చెప్పాను" అన్నాడాయన.

"ఇప్పుడు నిర్మల ఎక్కడ వుందో చెప్పు."

"నాకు తెలీదు."

"కాదు తెలుసు" అని బెల్టుతో యింకో దెబ్బ కొట్టాడు.

"చెబుతాను. ఆమె ఫ్రెండ్ ఒకామె వుంది. ఆమె పేరు అరుంధతి. ఆమె ఇల్లు విద్యానగర్ రైల్వేస్టేషన్ దగ్గర. ఇంటి నెంబర్ నూటనలభై ఆరు. నిర్మల అక్కడే వుండొచ్చు."

"వెరీగుడ్. నువ్వు ఇక్కడే వుండు మేము అక్కడకు వెళ్ళొచ్చేవరకు. నువ్వు అబద్ధం చెప్పావని తెలిస్తే ఈ హత్యానేరాన్ని నీ మీద నెడతాను" అన్నాడు ప్రదీప్ హేట్‌ను తలమీద పెట్టుకుంటూ.

అతను నలుగురు పోలీసులతో విద్యానగర్‌కు బయలు దేరాడు.

పావుగంట తర్వాత జీపు విద్యానగర్ స్టేషన్ దగ్గరకు వెళ్ళింది.

నూటనలభై ఆరు నెంబరు ఇంటిముందు ఆగింది జీపు.

తలుపులమీద చప్పుడు చేశాడు ప్రదీప్.

లోపల్నించి "ఎవరు?" అని అడిగింది ఓ ఆడగొంతు.

"టెలిగ్రాం."

తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా వున్న నిర్మల పోలీసులను చూడగానే

కంగారుపడి వెనక్కి పరుగుదీసింది.

ఆమె వెనుకే పరుగుదీశాడు ప్రదీప్.

లోపలి గదిలో కూర్చుని విస్కీ తాగుతున్నారు అరుంధతి—ఇంకో మగమనిషి. ఆ ప్రక్కనే స్పృహ లేని స్థితిలో డిటెక్టివ్ జగదీష్ పడివున్నాడు.

పోలీసులు కనిపించగానే గబుక్కున లేచి నిలబడ బోయాడు అతను.

అరుంధతి—నిర్మల ఏడుపు మొహాలతో ఇన్‌స్పెక్టర్‌ని చూశారు.

ముగ్గురు నేరస్థులకీ బేడీలు పడ్డాయి.

11

"మా మామయ్యే హంతకుడని నేనింకా నమ్మలేక పోతున్నాను. మీ రెలా వూహించగలిగారు?" అడిగింది కస్తూరి విప్పారిన మొహంతో.

"చాలా సింపుల్. ఎవరో హత్యానేరాన్ని మీ మీదకు నెట్టాలని మిమ్మల్ని జైలుకు పంపించటానికి ప్రయత్నించారని అర్థమయింది. అంత అవసరం యెవరికి వుంటుంది? మీకు ఎవ్వరూ శత్రువులు లేరని చెప్పారు. ఇక వున్న శత్రువల్లా మీ మామయ్యే.

మీరు మీ మామయ్యను పెళ్లి చేసుకోటానికి ఒప్పుకో లేదన్న విషయం మీ నాన్నగారి ద్వారా తెలిసింది. కాబట్టి ఆయనకు మీ మీద శత్రుత్వం పెట్టుకునే అవ కాశం వుంది! మీరు ఆయన్ని పెళ్లి చేసుకున్నట్లయితే ఆ సంతా ఆయనదవుతుంది. మీరు ఆయన్ని తిరస్క రించటంవల్ల ఆ అవకాశం పోయింది. అందుకే ఆయన మీ మీద పగ తీర్చుకోవాలని అనుకున్నాడు.

మీరు సుందరాన్ని ప్రేమించి మోసగించబడ్డారని

ఆయనకు తెలుసు. అసలు సుందరం కారణంగానే మీరు ఆయన్ని రెఫ్యూజ్ చేశారని ఆయనకు సుందరమంటే కోపం. అందుకే సుందరాన్ని హత్యచేసి, ఆ నేరాన్ని మీ మీదకు నెట్టి మిమ్మల్ని జైలుకు పంపించాలని ప్లాను వేశాడు.

నిర్మల—అరుంధతి ఆయన మనుషులు. నిర్మలను మీలాగే సుందరంచేత మోసపోయిన ఆడదానిలా మీ దగ్గరకి పంపించాడు. మీలో ఆవేశాన్ని కలిగించి, సుందరాన్ని హత్య చెయ్యటానికి మిమ్మల్ని ఒప్పించింది నిర్మల. ఈ లోపలే అరుంధతి మీ పేరుతో 'అరుణా ఐరన్ స్టోర్స్'లో కత్తిని కొన్నది. ఆ రశీదును నిర్మల మీ హ్యాండ్ బ్యాగ్ లో పడేసింది.

ఆ తర్వాత అరుంధతి-మీ మామయ్య సుందరాన్ని హత్యచేశారు. తర్వాత మీరు నిర్మలతో అక్కడికి వెళ్ళారు. మీ హ్యాండుబ్యాగ్ను నిర్మలే అక్కడ పడేలా చేసింది. ఎట్లాగయినా సుందరం హత్యలో మిమ్మల్ని ఇరికించాలని అనుకున్నారు. వాళ్ళ ప్రయత్నం అయిపోయింది. నిర్మల తను వుంటున్న గదిని మార్చేసింది. తన గురించి యెవ్వరికీ చెప్పవద్దని ఇంటి యజమానికి ఆశ చూపించింది. ఐనా ఆయన భయపడి ఆమె గురించి చెప్పాడు.

అరుంధతిని థియేటర్ నించి వెంటాడుతూ ఓ ఇంట్లోకి వెళ్ళిన నన్ను మీ మామయ్య తలమీద కొట్టాడు. పడిపోతూ ఆయన్ని చూసి గుర్తుపట్టాను. అంతకుముందు రెండుసార్లు నేను మీ ఇంటికి వచ్చినప్పుడు ఆయన మేడ మీదనించి నన్ను చూడటం గమనించాను" చెప్పాడు డిటెక్టివ్ జగదీష్.

"చాలా థాంక్స్ జగదీష్‌గారూ. నన్ను ఒక హత్యా నేరంలో ఇరుక్కోకుండా బయటపడేశారు" అన్నది కస్తూరి కృతజ్ఞతగా.

"ఇదిగో జగదీష్‌గారూ. పదివేల రూపాయలకు చెక్కు. మీరు పరిశోధనకు పూనుకోకుండా వున్నట్లయితే మా అమ్మాయినే పోలీసులు హంతకి అని జైల్లో పెట్టే వాళ్ళు. మీ మేలు పరచిపోలేను" అన్నాడు కస్తూరి తండ్రి జగదీష్కు చెక్కు అందిస్తూ.

"కొత్తవాళ్ళని నమ్మవద్దు. ఆవేశం-పగ-ప్రతీకారం మనల్ని కష్టాలకు గురిచేస్తాయి" అన్నాడు డిటెక్టివ్ జగదీష్ సిగరెట్టు వెలిగిస్తూ.

—: ఐపోయింది :—